# చంద్రుని మింగిన వెన్నెల

నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఇదే అంటే ఎవరూ నమ్మరు. కానీ ఇది నిజం. ఆ మధ్య శేఖర్ కనిపించాడు రాజమండ్రిలో.

"ఏరా! ఇక్కడున్నావేం?" అడిగాను.

"ఇక్కడ ఒక ప్రైవేటు స్కూలులో పని చేస్తున్నాను బాబాయి నీవెప్పుడొచ్చావు?" అడిగాడు. శేఖర్‌కి నేను బాబాయి వరుస.

మా తాత, తండ్రుల దగ్గరనుండి మామధ్య ఇదే వరుస.

వాడికన్నా నేను ఆరేళ్లే పెద్ద. కాని వాడు నన్ను గౌరవంగా చూస్తాడు. తన తండ్రి ఎడల చూపే ప్రేమే నాకు చూపిస్తాడు. అంతేకాదు, వాడు నేను ఒకే ఊరివారం ఒకే ఏటినీరు తాగినవారం. తోటల్లో దొడ్లలో ఆడిపాడినవాళ్లం. కష్టసుఖాలను సమానంగా పంచుకున్నాం. అందుకే వాడంటే నాకు ఇష్టం. వాళ్ల నాన్న పోయిన తరువాత మరీ దగ్గరయ్యాం.

"ఓ తెలిసిన వాళ్లింట్లో పెళ్లికని బయలు దేరి వచ్చాను. రాత్రి పెళ్లి' అన్నాను.

"పెళ్లయిపోగానే ఇంటికి వచ్చేయి బాబాయి" అంటూ ఇంటి ఎడ్రస్ ఇచ్చాడు.

పెళ్లయిపోగానే పెళ్లి భోజనంచేసివాడిల్లు వెతుక్కుంటూ వెళ్లాను. వెళ్లిన తరువాత తెలిసింది వాడుండేదీ ఒకే చిన్నగదని. అందులో తను, భార్య. ఒక సంవత్సరం క్రితమే పెళ్లయింది వాడికి. అత్తవారు ఉన్న వారు కారు, బంధుత్వాలను నిలుపుకోవాలని చేశారీ పెళ్లి. అయితే అమ్మాయి 'సుమ' మంచిపిల్ల. ఆ రాత్రి వాళ్లను బాధ పెట్టకుండా వెళ్లిపోదాం అనుకున్నా వదలలేదు వాళ్లు. ఆ ఇరుకు గదిలోనే వంట సామాను అంతా ప్రక్కకు సర్ది మడతమంచం వాల్చి నాకు పడక ఏర్పాటు చేశాడు శేఖర్. ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఏ ఒంటిగంటకో పడకున్నాం. ఉదయం నేను బయలుదేరు తూంటే చెప్పాడు "పట్నవాసం కష్టంగా ఉంది. ప్రైవేటు స్కూలులో ఉద్యోగం మరీ కష్టం. ఏ పల్లెటూరిలో ఏ చిన్న ఉద్యోగమైనా దొరికితే మేలు". అని.

నేను ఇంటికి వచ్చిన తరువాత ప్రాథమిక పాఠశాలలో బడివంతుళ్ల ఉద్యోగాలలో నియామకాలు జరుగనున్నాయని తెలుసు కున్నాను. వెంటనే ఆ విషయమే శేఖర్‌కి రాశాను. మూడు నెలలకి 'కేశవరం' అనే గ్రామంలో ప్రాథమికోపాధ్యాయుడిగా నియమింపడ్డాడని శేఖర్ రాశాడు. ఆనాటి నుండి శేఖర్‌ని ఆ ఊరు వెళ్లి చూద్దామను కుటుండగా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. కడకు ఓ రోజున కేశవరం బయలుదేరాను. నేనక్కడికి చేరేనరికి సాయంత్రమైపోయింది. శేఖర్ ఇల్లు తెలుసుకోవటం కష్టం కాలేదు. అది చిన్న పెంకుటిల్లు నే వెళ్లేసరికి వీధి అరుగుమీద వాలు కుర్చీలో ఓ చిన్న ట్రాన్సిస్టర్

రేడియో చెవి దగ్గర పెట్టుకుని ప్రాంతీయవార్తలు వింటున్నాడు. నన్ను చూసి "నీవా బాబాయి?" అంటూ ఎగిరిగంతేసినట్టు ముందుకు దూకి నన్ను గట్టిగా కౌగలించు కుని "సుమా! మా బాబాయి వచ్చాడు" అంటూ అరిచాడు. వాడి భార్య కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ల తెస్తూ 'కులాసాయే నా మావయ్యగారూ! ఒక్కరే వచ్చేరేం? అత్తయ్యను, పిల్లల్ని తీసుకురాలేకపోయారా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

"అందరం కులాసాయే. వీలవక ఎవర్నీ తీసుకురాలేదు. ఏరీ నీ పిల్లలు?" అని అడిగాను. పనసపండు, వాళ్ళత్త కాచి సీసాలో పోయిన నెయ్యి, జీడిపిక్కల సంచీ లోపల పెట్టిస్తూ.

"వేనవి సెలవులేగా. అందరూ రావలసింది". అంటూ మంచినీళ్ల గ్లాసందించింది.

"అందరం కలిసి సరదాగా ఉండేవాళ్లం కదా. ఈసారి ఒక్కరే వస్తే ఊరుకోను". అని వార్నింగు ఇస్తూ కాఫీ మా ఇద్దరికీ కలిపి తెచ్చింది. వాళ్లిద్దరికీ తెలుసు నేను కాఫీగత ప్రాణినని. అలాగని ఎక్కడ పడితే అక్కడ తాగనని.

"ఎలా ఉంది ఉద్యోగం? ఎలా ఉంది పల్లెటూరు?" అడిగాను కాఫీ తాగుతూ.

"పల్లెటూళ్లు మనకు తెలియనివి కావుగా. అయితే ఈ ఉద్యోగం బాగానే ఉంది కానీ ఎదుగుల లేదు. మహా అయితే యు.పి. స్కూలు హెడ్మాస్టరుగా రిటైరవుతానేమో". అన్నాడు బాధగా . వాడి ఉద్దేశం నాకర్థమైంది. ఇంకా ముందుకి పోవాలని వాడి ఉద్దేశం.

"కడిగిన ముఖం ఎందుకైనా పనికినస్తుంది. బి.ఎ. ప్రైవేటుగా చదివి పాసవు. నెమ్మదిగా హైస్కూలులో కాలు మోపవచ్చు కదా". చెప్పాను.

"అలాగే చేస్తాను". అంటూ నన్ను బావి దగ్గరకు తీసికెళ్లి ఇత్తడి గంగాళంలోకి నీళ్లు తానే తోడి 'స్నానం చెయ్యి బాబాయి ! అన్నాడు. నేను స్నానం చేసి వచ్చేలోగా 'సువర్ణరేఖ' మామిడిపళ్లు చేతిసంచీలో మోసుకుని వచ్చాడు.

నాకు వీధిలో మంచం వాల్చి తలగడా పెట్టి "కాసేపు నడుం వాల్చు బాబాయి". అంటూ వాలు కుర్చీలో కూర్చుని తన ఉద్యోగం గురించి చెప్పసాగాడు. చల్లగాలి వీస్తూంటే, స్నానం చేసిన మీదట ఆ సాయంత్రం వేళ చిన్న కునుకు పట్టింది. రేడియోలో ఇంగ్లీషు వార్తలు వస్తూంటే సుమ నిద్ర లేపింది. అరిటాకులో వేడి వేడి అన్నం వడ్డించి, కొబ్బరివచ్చడి, అరటికాయవేపుడు, ఘుమఘుమ వాసనలు వేసే చారు, గడ్డపెరుగు వడ్డించి కొసరి కొసరి తినిపించింది సుమ. శేఖర్ హడావుడి సరేసరి. "సువర్ణరేఖ మామిడిపండ్లు మా ఊరి తోటలోని బాబాయి". అంటూ రెండు తింటేగాని వదిలాడు కాదు.

ఇల్లు కొంత పెద్దది కాబట్టి నాకు వేరేగది కేటాయించాడు. నాకు నిద్ర పట్టేవరకు కబుర్లు చెప్పి తరువాత వెళ్లాడు శేఖర్. మర్నాటి ఉదయమే బయలుదేరి పోదామనుకున్నా ఇద్దరూ నన్ను వదలలేదు. ఓరోజు పక్క ఊరిలో వెంకటేశ్వరస్వామి

కోవెలకు ప్రయాణం పెట్టాడు. మర్నాడు మనవాళ్లే మంచివాళ్లు ఉన్నారంటూ పక్కూరికి తీసికెళ్లాడు. మూడోరోజున పక్కూరిలోటూరింగ్ టాకీస్‌లో 'మల్లీశ్వరి' సినిమాకి తీసికెళ్లాడు. నాలుగో రోజున తప్పదు వెళ్లాలంటే బస్సుస్టాండు వరకు భార్యతో బంగినపల్లి మామిడిపళ్ల బుట్టతో వచ్చి మళ్లీపిన్నిని తీసుకునిరా! బాబాయి అంటూ సాగనంపాడు. అప్పటికి వాడికి రెండేళ్ల కూతురు ఆర్నెల్ల కొడుకూను.

తిరిగి వచ్చిన తరువాత బి.ఎ. పుస్తకాలు సంపాదించాను. శేఖర్‌తో పాటు బి.ఎ.కి కడదామని సంకల్పం కలిగింది. కాని వృద్ధాప్యంలో ఉన్న నా తల్లిదండ్రులు, పెళ్లికెదిగిన చెల్లెలు నా పిల్లలు- వీరి పోషణభారం మోయటంలో నేను అపాటి చదువుకోసం పరుగెత్తలేనేమో అని పించింది. శేఖర్‌కి తన సంసారం తప్పమరే బరువు, బాధ్యతలు లేవు. తండ్రి బతికుండగానే పెళ్లి పేరంటాలు చేసిపోయాడు.

'నీవైనా బి.ఎ.కి తయారవు'. అంటూ పుస్తకాలు పంపించాను శేఖర్‌కి మరో మూడు సంవత్సరాలకే బి.ఎ.పూర్తి చేయటం, హైస్కూలులో అడుగు పెట్టటానికి శేఖర్ ఊహ చేయుటం నాకు తెలిసింది.

"బి.ఇడి. చదివితేనేగాని బి.ఎ.కి అర్థంరాదు బాబాయి". అంటూ ఓ రోజున అకస్మాత్తుగా వచ్చి వాలాడు శేఖర్.

అప్పుడు నేను రాజమండ్రిలో పోస్టుమాస్టరుగా ఉంటిని. "సీటు సంపాదించుకో మా ఇంటిలో ఉండి చదువుకుందువుగాని". అన్నాను, అప్పటికి మా చెల్లెలు పెళ్లి అయిపోయింది. మా తల్లిదండ్రులు గతించారు. నేనూ, నా భార్య, ఇద్దరాడ పిల్లలు, ఒక మగపిల్లాడు. అదీ నా సంసారం.

"కోడల్ని, పిల్లల్ని తీసుకొచ్చేయి. అందరం ఉందాం. 9 నెలలు ఎంత సేపు కళ్లు మూసి తెరచే అంతలో గడిచిపోతాయి". అంది మా ఆవిడ.

"వద్దులే పిన్నీ. సుమని వాళ్ల బాబాయి ఇంటికి పంపేస్తాను". అన్నాడు. శేఖర్‌కి సీటు వచ్చింది. తొమ్మిది నెలలు ఇట్టే గడిచిపోయాయి. మా దగ్గరే ఉండి శేఖర్ బి.ఇడి. పాసయ్యాడు.

శేఖర్ అదృష్టం అదే సంవత్సరం జిల్లా పరిషత్తు ఉపాధ్యాయల కోసం సెలక్షన్ పెట్టింది. పోటీ లేకుండా ఉద్యోగం వచ్చింది శేఖర్‌కి ఉద్యోగం రాగానే భార్యా పిల్లల్ని తీసుకుని వచ్చాడు "ఇది నీవు పెట్టిన భిక్ష బాబాయి". అంటూ.

"నాదేముందిరా? శ్రమపడ్డావు 'కృషితో నాస్తిదుర్భిక్షం' అన్నారు కదా". అన్నాను వాడు నన్నంత పొగడటం ఇష్టంలేక.

"శ్రమలోనే అంతా ఉంది. 'శ్రమలు లేకనె ఫలములు దుముకబోవు' అని దువ్వూరిరామిరెడ్డిగారనలేదూ? శ్రీశ్రీగారేమన్నారు శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని చెప్పలేదూ! అలాగని వ్యర్థమైన శ్రమకు, తనకు తనవారికి సుఖమీయని శ్రమకు అర్థం లేదు. కష్టపడు ఇంకా పైకి వస్తావు". అని కూడా చెప్పాను.

"థాంక్సు బాబాయి!" అన్నాడు.

నా మాటలు వృథా కాలేదు. ఉద్యోగం చేసుకుంటూనే ఎమ్.ఎ. ప్రైవేటుగా కట్టాడు. పాసయ్యాడు శేఖర్. పాసయిన దగ్గర నుండి కాలేజీ లెక్చరర్ ఉద్యోగానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. అదృష్టం కలిసి వచ్చింది. లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి లెక్చరర్ ఉద్యోగంలో చేరాడు. ఆ విషయం నాకు రాశాడు. మా మధ్య ఒక సంవత్సరం ఉత్తరాలు సాగాయి. తరువాత ఎందుకనో ఆగిపోయాయి. మా పిల్లలు పెద్దవాళ్లయ్యారు. పెద్దమ్మాయి పెళ్ళి, అబ్బాయి చదువు-ఉద్యోగం బాధ్యతలలో నేనూ తరచూ ఉత్తరాలు రాయలేకపోయాను.

అనుకోకుండా శేఖర్ పనిచేసే ఊరిలోనే మా - రెండో అమ్మాయి 'కమల'కి సంబంధం ఉందని తెలియటంతో, సంబంధం గురించి తెలిసికున్నట్టవుతుంది. శేఖర్‌ని చూసినట్టవుతుందని, రెండు మూడు రోజులుండి రావచ్చని బయలుదేరాను. ట్రైను సకాలానికి చేరిందిగాని శేఖర్ ఇల్లు మారడం చేత కొత్త ఇంటికోసం తిరగటంలో చాలా శ్రమ అయింది. మధ్యాహ్నం బస్ దిగిన నేను శేఖర్ మారిన కొత్త ఇంటికి చేరేసరికి సాయంత్రమయిపోయింది. ఆ వీధిలో అది అందమైన డాబా ఇల్లు. చుట్టూ అందమైన గార్డెను. నే వెళ్లేసరికి స్కూటరు పట్టుకుని వీధిలో నిల బడ్డాడు. ఎక్కడికో వెళ్లబోతున్నాడని అర్థమైంది. నన్ను చూస్తూనే స్కూటరు స్టాండు వేసి "బాబాయి ఎప్పుడు రావటం?" అంటూ ఇంట్లోకి తీసికొచ్చాడు నన్ను.

ముస్తాబైన సుమ ఎదురొచ్చి 'ఎప్పుడొచ్చారంటూ' పలకరించింది.

"ఎక్కడికో బయలుదేరుతున్నట్టున్నారు? అడిగాను.

"అవును బాబాయి మా ఫ్రెండ్సుము కొందరం ఫ్యామిలీలతో పిక్చరు ప్రోగ్రాము వేశాం. రా కూర్చో. ఇంకా టయిముందిలే పిక్చరుకి. ఏవిటి సంగతులు? ఎక్కడ నుండి రావటం". అడిగాడు వాచీ చూసుకుంటూ.

"ఇంటినుండే. కమల పెళ్ళి సంబంధాల వెతుకులాటలో తిరుగుతున్నాను. మీ ఊరిలో సంబంధం ఉందంటే...."

"మంచిమాటే" అని శేఖర్ అంటుండగా సుమ ఫ్రిజ్‌లోంచి మంచినీళ్లు అందమైన గాజు గ్లాసులో పోసి తెచ్చింది.

"నీవింకా తయారవలేదా? అవతలటయిము అవుతోంది". హెచ్చరించాడు.

"వచ్చేస్తా మావయ్యకి కాఫీ యిచ్చేసి". అంటూ కిచెన్‌లోకి పరుగెత్తింది సుమ.

"శాంతి, రఘు ఇప్పుడే వచ్చేస్తారు బాబాయి. నీవు టి.వి. చూస్తూండు. మేము 9 గంటలకల్లా వచ్చేస్తాం". అంటూ టి.వి. ముందుకు వెళ్లాడు శేఖర్.

సుమ కాఫీ కప్పులో తెచ్చిపెట్టింది. "వస్తాం". అంటూ కదిలారిద్దరూ.

వాళ్ల హడావుడి నాకర్థంకాలేదు. చాలా కాలం తరువాత వాళ్లను చూసిన నేను పొందిన ఆనందం వాళ్లకు లేదనిపించింది. ఒకప్పుడు ఎమ్.ఎ. పుస్తకాలు,

నోట్సులు మా ఊరిలో ఒకరి దగ్గరున్నాయని శేఖర్ హడావుడిగా ఓరోజు సాయంత్రం ఊడిపడి తే, వెంటనే జ్వరంతో ఉన్న మా అబ్బాయిని వదలి కమల్ని డాక్టరు దగ్గరకు వెళ్లమని చెప్పి ఆ రోజు రాత్రంతా వాడితో తిరిగి-మర్నాడు ఉదయం కూడా వర్కు ఎడ్జెస్టు చేసుకుని పుస్తకాలు ఇప్పించి పంపించేనే! మరచిపోయాడా?

స్నేహితులతో సినీమాకెళ్లడానికి ఇంత హైరానాపడుతున్నాడెందుకూ? అని పించింది. కాళ్లు చేతులు కడుక్కుని, తుండు గుడ్డతో ముఖం తుడుచుకుని కాఫీ అందుకున్నాను. కాఫీలో ఏదో లోపించినట్టనిపించింది.

ఉదయం నుండి బస్సు కుదుపుల్లో ప్రయాణం సాగిందేమో స్నానం చేసి నడుం వాల్చాలనిపించింది. కాని ఎవరూ లేని ఇంట్లో స్వతంత్రం లేదేమోననిపించి వాలు కుర్చీలోనే నడుం చేరాశాను.

రఘు వచ్చాడు క్రికెట్ బ్యాట్ ఊపు కుంటూ. వాడు నన్ను గుర్తుపట్టలే.

"ఏరా ఏం చదువుతున్నావు?" అడిగాను. పరిచయాన్ని పునరుద్ధరించు కోవాలని.

"సెవెంత్. మీరెవరు?" అడిగాడు.

"సేవాపురం పోస్టుమాస్టారంటారు. వినలే. మీ ఇంటికి ఓసారి వచ్చాను. మీరూ మా ఊరొచ్చారు. మరచిపోయావా?"

"ఏమో!" అంటూ టి.వి.లో సినీమా పెట్టి వెళ్లిపోయాడు.

శాంత, ఎవరో స్నేహితురాళ్లతో వచ్చింది. నన్ను చూసి పలకరింపుగా నవ్వుతూ "ఎప్పుడొచ్చారు?" అంది.

"ఇప్పుడే. బాగా చదువుతున్నావా?" అడిగాను.

"ఆఁ అమ్మేది?"

"మీ అమ్మ, నాన్న సినీమాకెళ్లారు."

"వీళ్లకు సినీమాలు, షికార్లు ఎక్కువ య్యాయి. మీరు వెళ్లలేదేం?" అంది.

"సినీమాలు నాకు నచ్చవమ్మా!" అన్నాను.

"మంచినీళ్ళు తాగుతారా!" అంటూ మంచినీళ్ల గ్లాసు నా ముందుంచి స్నేహితురాళ్లతో కబుర్లలో పడింది శాంత. నాకు నెమ్మదిగా నిద్రపట్టేసింది.

స్కూటరు ఆగిన శబ్దంతో నాకు మెలకువ వచ్చింది.

"సారీ బాబాయి ఆలస్యమైంది." అంటూ బెడ్రూములోకి వెళ్ళి మళ్లీ ఏవో కాగితాలు పట్టుకుని ముందు గదిలోకి వెళ్లాడు. శేఖర్‌తోపాటు ఎవరో వచ్చినట్లున్నారు. వాళ్లతో శేఖర్ మాట్లాడుతూంటే, ట్రేలో బిస్కట్లు, కూల్‌డ్రింక్సు పట్టుకెళ్లింది సుమ. శేఖరు వాళ్లకేదో బోధపరుస్తూ, వివరణలతో మాట్లాడుతున్నాడు. వాడు మాటాడిన మాటలు చాలా నేను వినలే. అందు చేత ఆ మాటలు నాకేమీ అర్థం కాలేదు.

"భోజనానికి రండి మావయ్య. ఆయన వచ్చేసరికి లేటవుతుంది." అంది సుమ.

"వాడ్ని రానియ్య." అన్నాను లోపల ఆత్మారాముడు గోలచేస్తున్నా.

పిల్లలు భోజనాలు చేసినట్టున్నారు. ఫానులు వేసుకుని నిద్రకుపక్రమించారు.

వాళ్ళు వెళ్లినట్టున్నారు. "రా బాబాయి." భోజనానికి పిలిచాడు శేఖర్.

ఆకలి చచ్చిపోగా ఏదో అయిందనిపించాను భోజనం.

"కమల పెళ్ళి సంబంధాలు వేటలో బయలుదేరానురా. మీ ఊళ్లో సంబంధం ఉందంటే వచ్చాను." అడక్కపోయినాచెప్పాను.

"ఉత్తరం రాయలేకపోయావా? నే కనుక్కుని రాసేవాడినిగా." అన్నాడు.

"ముందు అలాగే అనుకున్నాను. మిమ్మల్నందర్నీ చూసినట్టుంది అని బయలుదేరాను." అన్నాను.

"ఇవి ఒకటి రెండు రోజుల్లో తెమిలేవి కావు బాబాయి. రేపు వైజాగ్ వెళ్లే పని పడింది. రెండు రోజుల్లో వస్తాను. అప్పుడు కనుక్కుని రాస్తాను ఎడ్రస్సివ్వు." అన్నాడు.

"పోనీ నీవు వెళ్లరా! ఈలోగా నే వివరాలు కనుక్కుంటాలే. మనకందుబాటులో ఉంటుందంటే మనం వెళ్లి పెళ్లి చూపులకు పిలుద్దాం." అన్నాను.

శేఖర్ ఏమీ మాట్లాడలేదు. "శేఖర్ నన్ను ఉండవద్దంటున్నాడా?' అనే అనుమానం నాకొచ్చింది. ఆ అనుమానంతో నిద్రపట్ట లేదు.

ఉదయం నిద్ర లేచేసరికి శేఖర్ లేడు. వైజాగ్ వెళ్లాడని సుమ చెప్పింది.

"ఏదైనా అర్జంటు పనా అమ్మ!" అడిగాను.

"మీకు చెప్పకేమండి మావయ్యగారు. ఈయన మరో నలుగురు కలిసి స్థలం కొని ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టారు. అమ్మకం, లావాదేవీలన్నీ ఈయన పేరిటే పెట్టారు. ఎవరైనా పార్టీ ఉంటారేమో అని ప్రతి ఆదివారం వెళ్తారు. ఈ రోజు ఆదివారం కదా. పనుంటే రేపుంటారు. లేకపోతే సాయంత్రానికే వచ్చేస్తారు 'రాకరాక బాబాయి వచ్చాడు. ఉండటం అవటం లేదని బాధపడుతూ వెళ్లారు." అంది సుమ.

"వ్యవహారాలలాటివైనప్పుడు తప్పదు కదమ్మా. శేఖరు ఎప్పుడు వస్తాడో ఏవిటో నేవెళ్తాను. పెళ్లి కొడుకుల ఎడ్రస్సులిచ్చాను. కాస్త కనుక్కుని రాయమని చెప్పమ్మా." అన్నాను.

"మీరు వెళ్తారు బాగానే ఉంది. కానీ ఆయన రాగానే నన్ను కేకలేస్తారు మావయ్యా!" అంది.

"పరవాలేదమ్మ. ఆ మాత్రం సర్దిచెప్పవూ?" అంటూ బయలుదేరబోయాను.

"ఉండండి. కాఫీ అయినా తీసుకుని వెళ్దురుగాని." అంటూ కిచెన్‌లోకి

నడిచింది. నేను రాగానే సంబరపడే మనుషులేనా వీళ్లు అనిపించింది. ఉదయం నా స్నానం కాగానే దేవుడి దగ్గర నా సంధ్యావందన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసే సుమేనా ఈ అమ్మాయి అనిపించింది. భోజనం చెయ్యకుండా వదలని సుమేనా ఈ సుమ అనిపించింది.

నా ముందు కాఫీ కప్పుంచుతూ "త్వరగా తయారవండి పిల్లలూ. కోవెలకి వెళ్లొచ్చేద్దాం!" అంటూ కిచెన్‌లోకి పరుగెత్తింది.

భోజనం చేస్తే నలుగురం కూర్చుని భోజనం చేసే ఇల్లు మాది. కాఫీ తాగినా అంతే. కష్టాలయినా, సుఖాలయినా అంతే. శేఖరు అలాంటి ఇంటిలోంచి వచ్చినవాడే ఎందుకీ మార్పు? కాఫీ నాకు రుచించలేదు.

"వెళ్తానమ్మా!" అన్నాను. "మంచిది మావయ్య "అంటూ ముందు గదిలోకి వచ్చింది సుమ. నేను గేటుదాటి వెనుతిరిగి చూడలేదు.

శేఖర్ ఇంటిని వదిలి ఒక ఫర్లాంగు దూరం వచ్చానో లేదో అనిపించింది. "వచ్చిన పని మానుకుని వెళ్లిపోవడమా?" అని శేఖరు ఇంటిలో ఓ రెండు రోజులు ఉండగలిగితే వచ్చిన పని పూర్తయ్యేది. శేఖర్‌ని నేనే తప్పుగా అర్థం చేసుకుంటున్నానేమో అనిపించింది.

నాలుగడుగులు వేశానో లేదో శ్రీరామ్మూర్తి కనిపించాడు. మేము పోస్టల్ క్లర్కులుగా ఒకే సబ్‌పోస్టాఫీసులో చాలాకాలం పనిచేశాం. నన్ను చూడగానే అమాంతం కౌగిలించుకునేంత పనిచేశాడు. "చాలాకాలానికి కలిశాం. పద మా ఇంటికి" అంటూ లాక్కెళ్లాడు.

"ఏవిటిలా వచ్చావు?" అడిగాడు.

"ఈ పక్కవీధిలో ఉన్న చంద్రశేఖరం మా అన్న కొడుకే. మా అమ్మాయి పెళ్లి సంబంధాల వెతుకులాటలో వచ్చాను. వాడు లేడు. వెళ్లిపోతున్నాను."

"భలేవాడివే. పనిమీద వచ్చినప్పుడు పని పూర్తిచేసుకోకుండా వెళ్తావుటయ్యా. మీ చంద్రశేఖరు సంగతి నాకు తెలుసు. అతను ఊళ్లో ఉన్నా నీకందడు. అంత బిజీ మనిషి ఒకపక్క భార్య పేరిట 'యూనిట్ ట్రస్టు' పనులు, మరో వంక ఇళ్లస్థలం అమ్మకాలు, తన ఉద్యోగం- అదీకాక ప్రైవేటు కాలేజీ నిర్వహణ- నీకందుతాడటయ్యా! నీ పిచ్చి గాని. బుద్ధిమంతుడు, జాగ్రత్తపరుడు ఎవరిదగ్గర ఎలా మసలాలో తెలుసు. అందుకే చక్కటి ఇల్లు కట్టుకున్నాడు." అన్నాడు.

"శేఖర్ ఇల్లు కట్టాడా?"

"ఏం నీకు తెలియదా? ఇప్పుడతనున్న ఇల్లు అతనిదే. చాలా అట్టహాసంగా గృహ ప్రవేశం చేశాడు. నీకు తెలీదూ?" అడిగాడు శ్రీరామమూర్తి.

చిన్నప్పటి నుండి ప్రతి విషయాన్ని నాకు చెప్పే శేఖరం. నా సలహా లేనిదే ఏపని చేయని శేఖరం, ఈ విషయం బొత్తిగా నాకెందుకు చెప్పలేదు? ఒకవేళ

వీలుపడలేదేమో. గృహప్రవేశానికైనా రమ్మని రాయచ్చుగా. అదీ మరచిపోయినా ఇంటికిరాగానే ఇల్లు చూపించి 'ఇల్లు కట్టుకున్నాను బాబాయి' అని చెప్పొచ్చుగా. ఎక్కడ వచ్చిందీ తేడా? ఎందుకీ తేడా? శుభలేఖ రాశాడా! నాకందలేదా! ఇది మా డిపార్టు మెంటుకే అవమానం, అలా జరిగుంటే.

రామ్మూర్తి ప్రశ్నకు నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. రామ్మూర్తి ఇంటిలో భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం పెళ్లి వాళ్ల ఎడ్రస్‌లు తీసుకుని బయలుదేరాం. ఒకబ్బాయి ఇప్పుడల్లా పెళ్లి చేసుకోనన్నాడు. మరొకతను చెల్లెలు పెళ్లయిన మరుక్షణమే పెళ్లి చేసుకుంటానన్నాడు. ఇంకోబ్బాయి తండ్రి అరవై వేలు, లాంఛనాలు యిచ్చే మాటయితే గడప ఎక్కండి అన్నాడు.

నేను డీలా పడిపోయాను.

"అలా కంగారుపడకు మంచి సంబంధం చూసి రాస్తాను. వద్దువుగాని". అన్నాడు. నేనారోజే తిరుగుముఖం పట్టాను.

నేను తిరిగొచ్చిన వారం రోజులకే రామ్మూర్తి ఉత్తరం రాశాడు.

"మీ శేఖరం పనిచేసి కాలేజీలోనే ఒక లెక్చరర్ పెళ్లికొడుకున్నాడు. మనకన్ని విధాల తగినది. నీవొస్తే మాటాడదాం" అని.

నేను ఆలస్యం చేయకుండా సరాసరి రామ్మూర్తి ఇంటికే వెళ్లాను.

పెళ్లికొడుకు శేఖర్ కాలేజీ వాడేకనుక, శేఖర్‌కి తెలియకుండా వ్యవహారం సాగించడం మంచిది కాదనిపించింది. రామ్మూర్తీ నాఆలోచనను కాదనలేదు.

వెంటనే శేఖర్ ఇంటికి వెళ్లాను. అప్పుడే కాలేజీ నుండొచ్చాడట. పోర్టికోలోనే కనిపించాడు. శేఖర్ పలుకరించకముందే నే వచ్చిన విషయం చెప్పాను.

"అతనా? అతనేమంత పుష్ ఉన్నవాడు కాదు బాబాయి. సంపాదించుకునే మార్గాలున్నా ముందుకిరాడు. ఉన్నదేదో చాలంటాడు. అయినా లెక్చరర్‌కిమ్మని ఎవరు చెప్పారు బాబాయి? ఎదుగుబొదుగులేని ఉద్యోగం. ఇంత దూరం వచ్చావుగాని మీ ఊళ్లోనే డాక్టరు సంబంధాలు రెండున్నాయి. నేను విన్నాను. కట్నం యిస్తే యిస్తాంగాని కమల సుఖపడుతుంది..." ఇలా సాగింది శేఖర్ బోధ. పోర్టికోలోనే కూర్చొని.

"సరే! రామ్మూర్తిని కలిసివస్తాను" అంటూ లేచాను.

అప్పుడే సుమ, పిల్లలు రిక్షా దిగారు స్కూలునుండి.

"మావయ్యా ఎప్పుడొచ్చారం"టూ ఇంట్లోకి వెళ్లింది.

"ఈ పక్క ప్రైవేటు స్కూలులో సుమ పనిచేస్తోంది. పిల్లలూ అక్కడ చదువుతున్నారు." అన్నాడు శేఖరు.

"నీ జీతం నీకు సరిపోదట్రా శేఖరూ?" అని నోటి చివరివరకు వచ్చింది. శేఖరు ఏదైనా సమాధానం సరిపోయేటట్టు చెప్పగలడు. కాని నాకవి నచ్చవు.

మనిషి ఏ పనీ పాటు లేక నిరర్థకుడిలా శ్రామికశక్తిని వ్యర్థపరుస్తూ సోమరిపోతులా ఉండకూడదని శేఖరుకి నేను బోధపరిచానే గాని విశ్రాంతిలేని శ్రమను నేను ఉద్బోధించలేదు. శ్రమ ధనసంపాదన కోసమే అనీ నేను చెప్పలేదు.

నేను మౌనంగా ఉండిపోయాను. నా మౌనం నచ్చలేదో, నేనక్కడ ఉండటం తనకు నచ్చలేదో కుర్చీలో అసహనంగా కదిలాడు శేఖరు.

"ఏవండీ, మీకు ఫోను వైజాగ్‌నుండే. శాంతారామ్‌గారు" అంటూ ఆనందంగా పరుగెత్తుకుంటూ' ఫోను రిసీవర్‌ను శేఖరు దగ్గరికి తెచ్చింది సుమ.

"శాంతారామ్‌గారే! సక్సెస్ అన్నమాట" అంటూ రిసీవర్ అందుకున్నాడు. "హల్లో! సక్సెస్సేనా! నేచెప్పలే! ఓ పైస తగ్గడానికి వీల్లేదు. మనమాలా ఉంటేగాని దారికి రారు... ఒకే.... నేను రేపు గుంటూరు వెళ్లి...ఎల్లుండికి వచ్చేస్తా... పార్టీని వదలద్దు..." ఇలా సాగుతోంది శేఖర్ సంభాషణ.

"నే వెళ్తానురా!" అంటూ లేచాను. ఇద్దరికీ చెప్తున్నట్టు చూసి. నావేపు చూసి "అలాగే" అంటూ మళ్లీ సంభాషణలో మునిగిపోయాడు శేఖర్. సుమ ఏమందో నేను వినలేదు.

మీరనవచ్చు శేఖర్ ఉన్నతిని చూడలేక ఈర్ష్యతో శేఖర్ నుండి వచ్చేశావు అని. మన ప్రమాణాలలోనే ఎదుటివారిని చూడకూడదని.

వెన్నెల చంద్రుడికి అందం చేకూరుస్తుంది.

కాని వెన్నెల చంద్రుని మింగేయకూడదు.

చంద్రుని కనిపించనీయకుండ చేయ కూడదు.

సంపదలూ అంతే.

★ ★ ★